క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, కపిలేశ్వరపురం, తాతపూడి తదితర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వహణ కమిటీ, దాతల సహకారంతో అన్నదానం చేశారు.

అన్ని వేళలా విద్యుత్ సరఫరా



అర్తమూరుకు సంబంధించిన 3 ఫేజ్ సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కపిలేశ్వరపురం (మండపేట): అర్తమూరు గ్రామానికి విద్యుత్ సరఫరాను మెరుగుపర్చారు. మండపేట పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి అర్తమూరు గ్రామానికి 24 గంటలూ సరఫరా చేసే ఏర్పాటు చేశారు. 24 గంటల 3 ఫేజ్ సరఫరాను శనివారం మండపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా రూ.50 లక్షలు విలువైన విద్యుత్ పరికరాలను సమకూర్చారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మండపేట సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ శ్రీధర్, మండపేట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏం మునియ్య, ద్వారపూడి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.రవికుమార్, జూనియర్ ఇంజినీర్లు సత్యనారాయణ, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ



హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: పట్టణంలోని బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని ఆర్డీవో డి.అఖిల శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో పిల్లలకు పెడుతున్న ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. వాటి నాణ్యతను పరిశీలించి వార్డెన్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో నిర్వహిస్తున్న వసతి సౌకర్యాలను, పరిశీలించారు. అనంతరం రికార్డులను, హాస్టల్‌లో ఉన్న స్టాకును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలను హాస్టల్ పిల్లలకు అందించాలని సూచించారు.

సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలి

కాజులూరు: వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని రైతు సంఘం నాయకుడు, తణుకువాడ పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మొగలిపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ రసాయన ఎరువుల రేట్లు రోజురోజుకి పెరిగిపోతుండటంతో పంటల సాగులో పెట్టుబడులు అధికమవడమే కాకుండా పంట ఉత్పత్తులు విషతుల్యమౌతుందన్నారు. విత్తనశుద్ధికి జీవామృతం వినియోగం, సస్యరక్షణకు గోవు పేడ, మూత్రం, కషాయం వంటివి తయారు చేసి పంటలకు సోకు పలురకాల తెగుళ్లపై వినియోగించవచ్చన్నారు. రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు, క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించాల్సి ఉందన్నారు.

రెడ్డి సందీప్‌నకు చైర్‌పర్సన్ పలకరింపు



రెడ్డి సందీప్‌ను పలకరిస్తున్న చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం (మండపేట): రోడ్డు ప్రమాదానికి గురై శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తనయుడు రెడ్డి సందీప్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పలకరించారు. రాజుబాబు నివాసంలో శనివారం సందీప్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పలకరించినవారిలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చోడే శ్రీకృష్ణ, వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, నాయకులు యరమాటి వెంకన్నబాబు, తాడి రామారావు, దుగ్గిరాల రాంబాబు, కోళ్ల శ్రీను ఉన్నారు.

పేద విద్యార్థులకు సాయం

ఆలమూరు: మండలంలోని పెదపళ్లకు చెందిన పురోహితులు మేడవరపు లక్ష్మణరావు, దీక్షితుల రామకృష్ణ శర్మ శనివారం ఇష్టకామేశ్వరి ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థను ప్రారంభించారు. ఈ సహాయ సంస్థ ఎటువంటి లాభాపేక్ష లేకుండా కులమతాలకు అతీతంగా పేద విద్యార్థుల చదువు కోసం ఆర్థికంగా అండగా ఉంటామని తెలిపింది. ఈ ఫౌండేషన్ పూర్తి ప్రభుత్వ నిబంధనలతో పనిచేస్తుందన్నారు. విరాళాలిచ్చే దాతల కు ఆదాయ పన్ను మినహాయింపు ఉంటుందన్నారు.

ప్రజల కష్టాలు

- మండపేటలో తాగునీటి సమస్య
- 20 వార్డులకు అందని మంచినీరు
- శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంక్
- మరమ్మతు పనుల్లో తీవ్ర జాప్యం
- భూగర్భ జలాలు అడుగంటడంతో పని చేయని చేతి పంపులు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణ ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించి 50 ఏళ్ల కావడంతో శిథిలావస్థకు చేరింది. ట్యాంకు కుప్పకూలడంతో నిర్వహణ మూలన పడింది. జూన్ మొదటి వారంలో ట్యాంక్ నుంచి నీటి సరఫరా నిలిచిపోగా నెల రోజులుగా పట్టణ వాసులు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అదిగో ఇదిగో అంటూ ప్రకటనలు చేస్తున్నప్పటికీ మరమ్మతు పనులు మాత్రం నేటికీ పూర్తి కాలేదు. 30 వార్డుల్లోని 53,588 జనాభాకు సంబంధించిన తాగునీటి సమస్యపై ఈ కథనం..

కుప్పకూలిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్

మండపేట పట్టణంలోని బురుగుంట చెరువు పార్కు వద్ద ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించిన 50 ఏళ్లు అయింది. ట్యాంకు పై భాగమైన డోమ్ ట్యాంక్‌లో నీరు నిలిచే భాగంలోకి కుప్ప కూలిపోయింది. దీంతో నీటి సరఫరా విభాగమంతా ధ్వంసమైంది. 3.25 లక్షల గ్యాలన్లు సామర్థ్యం ఉన్న ట్యాంక్ శ్లాబ్ క్రమక్రమంగా పెచ్చులూడి చివరకు కూలిపోయింది. జూన్ 2న రాజమహేంద్రవరం సర్కిల్ పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, జిల్లా డీపీహెచ్‌ఓ హుస్సేన్ ఘటనా స్థలానికి వచ్చి ట్యాంక్‌ను పరిశీలించారు. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కమిషనర్ టీవీ రంగారావులతో చర్చించారు. డోమ్‌ను నిర్మించి నీటి సరఫరాను పునరుద్ధరించే కార్యాచరణపై చర్చించారు. ట్యాంక్ శిథిల స్థితికి చేరుతుండటమూ, మోటార్లతో నీటితో పాటు క్లోరిన్‌ను సైతం ట్యాంకులోకి పంపడంతో రసాయనిక చర్యలు ద్వారా కూడా డోమ్ కూలిపోవడానికి ఒక కారణంగా నిర్ధారణకు వచ్చారు. సమస్య పరిష్కారం కోసం ట్యాంక్ పై భాగం మొత్తం తొలగించి పోలీ కర్బన్‌తో తయారు చేసి తేలికపాటి డోమ్‌ను అమర్చేందుకు నిర్ణయించారు. అందుకు నెల రోజులు సమయం పడుతుందంటూ మరమ్మతు పనులను ప్రారంభించారు.

పనులు ఆలస్యం

ట్యాంక్ మరమ్మతు పనులకు నెల రోజులు పడుతుందన్నప్పటికీ శిథిల భాగాలను తొలగించేందుకే సుమారు నెల రోజులు పట్టింది. ఈ నెల 30న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించగా కౌన్సిలర్లు ట్యాంక్ మరమ్మతులో జరుగుతున్న జాప్యాన్ని కమిషనర్ రంగారావును ప్రశ్నించారు. కాంట్రాక్టరు పనిని చాలా ఆలస్యంగా చేస్తున్నాడనీ, అతనితో రాత పూర్వకమైన హామీని తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల సూచించారు. ప్రస్తుతం మోటార్లతో నేరుగా పైపులైన్లకు అనుసంధానం చేస్తూ తాగు నీటి సరఫరా చేస్తున్నారు. పట్టణంలోని 20 వార్డులకు చెందిన నివాసితులు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు.



మరమ్మతులో ఉన్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్

మున్సిపల్ కౌన్సిల్‌లో..

6వ వార్డు వైఎస్సార్ పార్కు వద్ద 1450 కేఎల్ సామర్థ్యం గల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ 50 ఏళ్లతో శిథిలావస్థకు చేరింది. దీనికి ప్రత్యామ్నాయంగా రూ. 2.95 కోట్ల అంచనా వ్యయంతో నూతన ట్యాంక్ నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించేందుకు తీర్మానం చేశారు. హెడ్ వాటర్ వర్క్స్ నందు రూ.3.75 కోట్లతో 1000 కేఎల్ సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ రెండు ట్యాంకుల నిర్మాణాలూ ఎక్కువ ఖర్చు, సమయాలతో కూడుకున్న పనులు కావడంతో పట్టణ ప్రజలను ఈ ప్రతిపాదనలు ఊరిస్తూ ఉంటాయి. కనీసం తాత్కాలికంగా అందజేస్తున్న తాగునీటి సరఫరా ప్రక్రియనైనా సక్రమంగా సకాలంలో అందజేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పనిచేయని చేతిపంపులు

మోటార్ల సాయంతో పైపులైన్ ద్వారా తాగునీటిని అందిస్తున్నప్పటికీ సరఫరా నివాసితుల అవసరాలకు తగినంతగా ఉండడంలేదు. దీంతో ఇళ్ల వద్ద ఉన్న చేతిపంపులను వినియోగిస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చేతి పంపుల ద్వారా వచ్చేనీటి ధార సన్నగిల్లుతోంది. ఇలాంటి తరహా సమస్యలతో పట్టణంలోని 6, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18 వార్డుల నివాసితులు సతమతమవుతున్నారు.

ప్రభుత్వాలకు కనువిప్పు కలగాలి



శీలలో కరపత్రాలు పంచుతూ సమ్మె విజయవంతం చేయాలని కోరుతున్న రాజబాబు తదితరులు

కాజులూరు: కష్టజీవుల కష్టాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా ప్రజలు పోరాటాలు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. శనివారం మండలంలోని శీల, మంజేరు తదితర గ్రామాల్లో రాజబాబు తదితర నాయకులు పర్యటించి రైతులు, కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల తొమ్మిదో తేదీ బుధవారం వామపక్షాల ఆధ్వర్యంలో జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శీలలో రైతులు, వ్యవసాయ కూలీలతో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ప్రతి ఒక్కరూ సమ్మెలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బుడితి ప్రభాకరరావు, ఎస్.ఇమ్మానుయేలు, జె.నాగేశ్వరరావు, ఎం.రామారావు, ఈశ్వరరావు, జల్లి ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

ఆలీబాబా 40 దొంగల తీరుగా చంద్రబాబు పాలన

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో చంద్రబాబు పాలన ఆలీబాబా 40 దొంగలు అన్న తీరుగా ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి మండిపడ్డారు. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో శనివారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగ్గిరెడ్డి మాట్లాడుతూ నిజం గడప దాటేలోపు అబద్ధం లోకం చుట్టి వస్తుందని లోకోక్తి ఉందన్నారు. అదే తీరుగా మనం నిజం చెప్పేలోపు చంద్రబాబు అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. జగన్ నిజం అయితే చంద్రబాబు అబద్ధం అని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిపి ఎన్నికల హామీలను త్రికరణ శుద్ధిగా అమలు చేస్తామని ప్రజలను నమ్మించి పరిపాలనలోకి వచ్చి ఏడాదిగా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇకపై వారి మోసాలను సాగనివ్వకూడదని చంద్రబాబు మేనిఫెస్టోని రీకాల్ చేసే విధంగా ప్రజలను చైతన్యవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. పార్టీ అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇస్రాయేలు, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, పి. గన్నవరం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి శ్రీనివాసరావు, రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మూడు మండలాల ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, మాతా భారతి, వెంకటాయపాలెం సర్పంచ్, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్ కుమారి తదితరులు మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధపు వాగ్దానాలతో చేసిన మోసాన్ని ప్రజల్లో ఎండగట్టి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పేలా చైతన్యం కల్పించాలని సూచించారు. కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన తరువాత మోసగిస్తున్న విధానాలను గ్రామగ్రామానా ప్రజల్లోకి తీసుకుని వెళదామని పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. నిజాలను ప్రజల ముందుకు తెస్తున్న సాక్షి టీవీ ప్రసారాలను కేబుల్ ఆపరేటర్‌లు నిలుపుదల చేస్తే వారికి బిల్లులు కట్టమని చెప్పి సాక్షి ప్రసారాలను తిరిగి కొనసాగించేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, జెడ్పీటీసీలు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఒబిలినేని రాజకుమారి, వనుం వెంకట సుబ్బారావు, మూడు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ విభాగాల అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

లోక్ అదాలత్‌లో 103 కేసుల పరిష్కారం

రామచంద్రపురం: స్థానిక కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో 103 కేసులు పరిష్కారం అయ్యాయని రామచంద్రపురం 13వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎం.హరి నారాయణ తెలిపారు. అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులతో ఆయన సమావేశం నిర్వహించి కక్షిదారులకు అవగాహన కల్పించారు. రాజీమార్గం ద్వారానే సత్వర పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమలో సివిల్ కేసులు 15, క్రిమినల్ కేసులు 75, పీఎల్సీ కేసులు 13, పరిష్కారం కాగా వీటి విలువ రూ.1,25,78,934 ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జ్ నిజాం శారద, జూనియర్ సివిల్ జడ్జ్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, లోక్ అదాలత్ సభ్యులు పలివెల సత్యనారాయణ, జుత్తుక నాగేశ్వరరావు, బొడ్డపాటి సురేష్ కుమార్, నీలం సత్తిరాజు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు వరాహ నరసింహమూర్తి, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు కృషి

కపిలేశ్వరపురం (మండపేట): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా అందరూ కృషి చేయాలని మండపేట నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేఆర్ఆర్‌సీ పి.కృష్ణమూర్తి అన్నారు. తన కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల రాజకీయ ప్రతినిధిలు, ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. ఫాం 6, 7, 8 లను పరిశీలించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారుల జాతీయ శిక్షణా కార్యక్రమం షెడ్యూల్, రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్ ప్రతిపాదనలపై చర్చించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు యరమాటి వెంకన్నబాబు, కూటమి తరపున ఉంగరాల రాంబాబు, వి.దుర్గా ప్రసాద్, రమణ, నామాల చంద్రరావు, ఎంజె రాజుబాబు, సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, కపిలేశ్వరపురం డిప్యూటీ తహసీల్దార్ కె.జానకి రామయ్య, మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పీఏ మెహర్ బాబా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం. శ్రీనివాస రావు, ఎన్నికల ఆపరేటర్లు పాల్గొన్నారు.



మండపేటలో చర్చిస్తున్న అధికారులు, పార్టీల ప్రతినిధులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

రామచంద్రపురం: రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు వెంటనే విడుదల చేయాలని, యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ జీవో నెంబర్ 77 రద్దు చేయాలని కోరుతూ డివిజన్ రెవెన్యూ కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన ప్రభుత్వం నుంచి అందక కోర్సు పూర్తి చేసుకున్న ఉద్యోగాలకు వెళ్తున్న సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ నెలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు చెల్లిస్తామని ప్రకటన ఇచ్చి, రాష్ట్ర బడ్జెట్లో డబ్బులు ప్రకటించినప్పటికీ నేటికీ విద్యార్థుల ఖాతాలలో జమ కాక కళాశాలకు వెళ్తే సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని మరిచిపోయి విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోకుండా అధికారంలోకి వచ్చిన ఏడాది పాలన బాగా జరిగిందంటూ సంబరాలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికలలో ప్రధాన హామీగా ఉన్న పీజీ విద్యార్థులకు ఇచ్చిన జీవో నెంబర్ 77 రద్దు చేస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 77వ పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక దూరమవుతున్న పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. ఈ సమస్యపైన జులై 11న కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట్, సహాయ కార్యదర్శి సాయిరాం, రామచంద్రపురం టౌన్ అధ్యక్షులు విజయ్, సుహాస్, మణిదీప్ పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలి



మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలుపుతున్న టేకిమూడి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గం నుంచి జిల్లా కమిటీకి నియమితులైన నాయకులు పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. ఇటీవల పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి విడుదలైన జిల్లా కమిటీలో యాక్టివిటీ కార్యదర్శిగా మండపేటకు చెందిన టేకుమూడి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయన శనివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వెంట పార్టీ కార్యదర్శి కర్రి పాపారాయుడు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చోడే శ్రీకృష్ణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిరిపురపు శ్రీనివాస్, 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, 18వ ఇంచార్జ్ పార్టీ ఇన్‌చార్జి యర్రగుంట మణికంఠ, నాయకులు సాధనాల శివభగవాన్ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని వేగాయమ్మపేటలో సర్పంచ్ అంబటి తుకారం ఆధ్వర్యంలో శనివారం రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను మంత్రి ప్రారంభించారు. వీటితో పాటు గ్రామంలో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరువ చేయడంలో ఈ భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



వేగాయమ్మపేటలో రైతు సేవా కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

భీమేశ్వరాలయ హుండీల ఆదాయం రూ.28 లక్షలు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న అర్చకులు, సిబ్బంది, సేవకులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ హుండీల ఆదాయం రూ.28,04,547 వచ్చినట్లు ఆలయ ఈఓ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని శనివారం విలేకరులకు తెలిపారు. ఈ ఏడాది మార్చి 5 నుంచి జూలై 5 వ తేదీ వరకు 122 రోజులకు గాను ఆదాయం లెక్కించగా ఆలయ హుండీల ద్వారా రూ.26,90,853, అన్నదానం హుండీ ద్వారా రూ.1,13,694 కలసి మొత్తం రూ.28,04,547 నగదు రూపంలో రాగా, 5 గ్రాముల బంగారం, 90 గ్రాముల వెండి కూడా వచ్చిందని తెలిపారు. హుండీల ఆదాయం లెక్కింపులో దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, కె.గంగవరం గ్రూపు ఆలయాల ఈఓ. వి.బాలకృష్ణ, వెల్ల గ్రూపు దేవాలయాల ఈఓ వైవీవీ సత్యనారాయణ, ఆలయ అర్చకులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సీఐ

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఒక వ్యక్తిని హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రికి తరలించి రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ మానవత్వం చాటుకున్న సంఘటన ఆలమూరులో జరిగింది. 216 ఏ జాతీయ రహదారిలోని ఆలమూరు గౌతమీ గోదావరి కొత్త వంతెనపై నాలుగు చక్రాల వాహనం ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటువైపు వెళుతున్న సీఐ విద్యాసాగర్ ఈ ప్రమాద దృశ్యం కంటపడింది. హుటాహుటిన గాయపడ్డ ఆ వ్యక్తిని సాటి వాహనదారుల సాయంతో తన జీప్‌లో ఎక్కించుకుని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం గాయపడిన వ్యక్తిని పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం గ్రామానికి చెందిన తేతలి దుర్గాప్రసాద్‌రెడ్డిగా గుర్తించారు. ఆమేరకు సేకరించిన వివరాల ద్వారా బంధువులకు సమాచారాన్ని అందించి మెరుగైన వైద్యం అందించేందుకు సహకరించారు. అలాగే గత జూన్ 13న ఈ వంతెనపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న మహిళను రక్షించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

మా ఉద్యోగాలు ఇప్పించండి

- ఎంఈఓ కార్యాలయం వద్ద ఆందోళన

సాక్షి, అమలాపురం: 'మా ఉద్యోగాలు మాకు ఇప్పించండి మహాప్రభో' అని ఐ.పోలవరం ఉన్నత పాఠశాల మధ్యాహ్నం భోజన కార్మికులు స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. గత 18 సంవత్సరాల నుంచి మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా ఐ.పోలవరం హైస్కూల్‌లోమహాలక్ష్మి ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న ఇళ్ల వెంకటలక్ష్మి, కట్టా లక్ష్మి, కొప్పిశెట్టి అనంతలక్ష్మి, ఇళ్ల దుర్గలను ఒక్కసారిగా విధుల నుంచి తీసి వేశారు. దీనితో ఎంఈఓ కార్యాలయం వద్ద శనివారం వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఎటువంటి సమాచారాన్ని ఇవ్వకుండా అర్ధాంతరంగా మా ఉద్యోగాలను తీసేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్ల నుంచి ఈ ఉద్యోగం మీద ఆధారపడి తాము బతుకుతున్నామని, ఉద్యోగం పోవడంతో మా బతుకులు రోడ్డు మీద పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ ఒత్తిడి వల్లే మమ్మల్ని ఉద్యోగాల నుంచి తీసేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించిన మళ్లీ తమకు ఉద్యోగాలు ఇప్పించాలని కోరుతున్నారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.దుర్గారావు తోపాటు పలువురు మద్దతు పలికారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ జూలై తొమ్మిదో తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.దుర్గారావు కోరారు. దీనిపై ఆయన ఐ.పోలవరంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహిస్తున్న సమ్మెలో మధ్యాహ్నం భోజనం కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యవేణి పాల్గొని కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, గంగారత్నం, గంగా భవానీ, పార్వతి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.